# ఆత్మజ్ఞానం

బ్రాంచి మేనేజరుగా ప్రమోషను యిస్తూ నన్ను అనంతరాజుపేట అనే ఊరికి బదిలీ చేశారు. ఈ మహీ మండలంలో ఆ ఊరి ఉనికిని గురించి కనిపెట్టడం దుస్తరమైపోయింది. ఆఫీసు రికార్డుల్లో నుంచి మా బ్యాంకు తాలూకు శాఖల జాబితా వెలికి తీయించాను. ఎంత జాగ్రత్తగా పరిశీలించినా అందులో 'అనంతరాజుపేట' కనిపించకపోయేసరికి మా డిపార్టు మెంటువాళ్ళు నాతో ఏదైనా పరాచికం ప్రారంభించేశారేమోనన్న అనుమానానికి గురిగాక తప్పింది గాదు.

ఎట్లాగో కొంత లోకజ్ఞానాన్ని గూడా సంపాదించిపెట్టుకున్న సహోద్యోగి ఒకతను అనుమాన నివృత్తి చేయగలిగాడు కాబట్టి సరిపోయిందిగానీ, లేకుంటే నేను ఏకంగా హెడ్ ఆఫీసుకే పిర్యాదు చేసేవాడినేమో! "పక్క జిల్లా బార్డరుకు చేరువగానే వుంటుందండీ గురువుగారూ! నిస్సందేహంగా మారుమూల ప్రాంతమే. ఇక్కడి నుంచి ఎంతలేదన్నా రెండు వందల కిలోమీటర్లుండొచ్చు. అక్కడ బ్రాంచి ఏర్పాటుచేసి యింకా రెండేళ్ళు గూడా కాలేదేమో! పాత లిస్టులో పేరెలా వుంటుంది?"

ముప్పతిప్పలు పడి మూడు బస్సులు మారి హూనమైపోయిన శరీరంతో ఆ ఊళ్ళో అడుగుపెట్టాను. పేరు బాగుంది గదా అని నేనా ఊరిని గురించి ఎన్నెన్ని మధురోహలు ప్రోదిచేసుకున్నానో యేమో, తీరా బస్సు దిగేసరికి ఆ ఊరి నిజ స్వరూపం నన్ను వెక్కిరిస్తున్నట్టే తోచింది. లేమికి రకరకాల బురఖాలు తొడిగినట్టున్న ఇళ్ళు ఒక్కొక్కచోట నారు పోసినట్టుగాను, మరికొన్ని చోట్ల చెల్లాచెదరుగా వెదజల్లినట్టుగానూ ఒక తీరూ తెన్నూ లేకుండా వున్నాయి. వైవిధ్యం కోసమన్నట్టుగా వాటి నడుమ చాలా సకృత్తుగా పక్కా కట్టడాలున్నూ కొన్ని కనిపించాయి. వాటిలో ఒకదాన్లో మా బ్యాంకు తలదాచుకోగలిగింది. నాకు ముందుండిన మేనేజరు ఎవరోగానీ రావణుడు కైలాసాన్ని కదిలించినట్టుగా, మా డిపార్టుమెంటును కూకటివేళ్ళ నుంచీ కొన జుత్తుదాకా కదిలించి, కోరుకున్న చోటికి ట్రాన్స్‌ఫరు తెప్పించుకుని, ఆర్డరు చేతికందగానే అకౌంటెంటుకు ఛార్జీ అప్పగించి, వుచ్చులు తెంచుకున్నట్టుగా ఉడాయించేశాడు. పై ఆఫీసర్లకు పరమ విధేయుడుగా పేరుతెచ్చుకున్న అకౌంటెంటు బాలరాజు కాఫీలూ ఉపాహారాలూ సిద్ధం చేయించి, స్నానానికి వేన్నీళ్ళు పెట్టించి, మధ్యాన్నానికి కారియర్‌లో భోజనం తెప్పించి, వెలిబుచ్చిన ప్రతి అవసరాన్నీ 'నో ప్రాబ్లం'తో తుడిచిపెట్టేస్తూ సముచిత సత్కారాల్లో నా కెట్టి కొరతగానీ రాకుండా చూశాడు.

"అయ్యా మిస్టర్ బాలరాజా! ముందుండిన మేనేజరు ఈ ఊళ్ళో కాపురమైనా పెట్టకుండా కాలం గడుపుకుని వెళ్ళాడని విన్నాను. నాకలా కుదరదు. ఓ అద్దె కొంప కావాలి. దాని మాటేమిటి?" అని అడిగాను.

"నో ప్రాబ్లం సార్!" — టక్కుమని జవాబిచ్చాడు బాలరాజు. "చూస్తేగానీ మీరు నమ్మరేమో! మీ కోసం అలాంటి యిల్లొకటి చూసిపెట్టాము. అది ఇక్కడికిక్కడ కట్టినట్టుండదు. సిటీలోని ఏ కాలనీ నుంచో అమాంతంగా ఎత్తుకొచ్చి యిక్కడ పెట్టేసినట్టుంటుంది..."


"అదెక్కడుందయ్యా బాబూ? ఊళ్ళో అలాంటి యిల్లు ఎక్కడా కనిపించ లేదే!"

"ఉంది సార్! ఊళ్ళో ఆ భాగాన్ని 'దర్గామిట్ట' అంటారు."

ఏదో ఒక మిట్ట! నివాసయోగ్యంగా ఒక యిల్లు దొరికితే చాలునన్నది అప్పటి నా కనీసపు కోరికగా వుండిపోయింది.

ఆ రోజు సాయంకాలం నాకు పుర వినోదాలు చూపిస్తూ వెళ్ళి వెళ్ళి ఊరికి పడమరగా ఓ మర్రిచెట్టు కింద చిన్న మజిలీ ఒకటి వేశాడు బాలరాజు.

"చూడండి సార్! ఇక్కడి నుంచి ఊరంతా కనిపిస్తుంది. అది బొమ్మదేవరపాళెం.



—మధురాంతకం రాజారాం

అనుభవాని కొస్తే గానీ ఆత్మజ్ఞానం రాదు. ఆత్మజ్ఞానం అబ్బితేగానీ తత్వం బోధపడదు. మనుషుల మధ్య జీవిస్తూనే విడిగా వుండే మనిషి, మనిషి ఆకారమే తప్ప మనిషి కాదు. అయితే, సుప్తశిల మేలుకున్నట్టుగా అటువంటి మనిషి కూడా ఎప్పుడో ఒకప్పుడు మేలుకోక తప్పదు. మేలుకొన్నాక మనుషుల్లో కలవకా తప్పదు. ప్రత్యేకంగా ఇటువంటి పాఠాల అవసరం లేకుండా ఎప్పుడూ మనిషితనంతో వుండే వాళ్లే ఆ మనిషి కాని మనిషినీ మనిషిని చేసేది.

సుప్తశిలలను మేలుకొలిపే శిల్పులు తామేనన్న సంగతి వాళ్లకు తెలీకపోవడమూ వాళ్ల గొప్పతనమే.

దాని కానుకున్నట్టే బస్‌స్టాండు. బస్ స్టాండు నుంచి బజారు. బజారుకు దక్షిణంగా మండీపేట...''

విసుగుతో నేను వారించాను — ''ఈ వివరాలన్నీ నా కెందుకయ్యా బాబూ! ఆ దర్గామిట్ట ఎక్కడుందో చెప్పరాదూ?''

''అయ్యో, అందుకేగదండీ యిక్కడికి తీసుకొచ్చింది'' అన్నాడు బాలరాజు. చెట్టు కావలి వైపుకు తీసుకెళ్ళి బృహన్నల ఉత్తరుడికి కురు సైన్యాన్ని చూపించినట్టుగా ''అదిగో, అదేనండి దర్గామిట్ట'' అన్నాడు.

అతడు దర్గామిట్ట అన్నచోట యుద్ధ భూమిలో వేసిన గుడారాల్లా నాసిరకం జనావాసాలు కొన్ని కనిపిస్తున్నాయి. బొత్తిగా వెలలేనివి, లేదా వెల బాగా తక్కువైనవీ అయిన ప్రకృతిలోని ముడి వస్తువులు — మట్టీ, అడివి కొయ్యలూ వెదురు బొంగులూ, తాటి మట్టలూ, కొబ్బరి పట్టలూ మొదలైనవాటితోనే ఆ ఇళ్ళు రూపొందినట్టున్నాయి. మానవ జీవితమే స్థిరం కానప్పుడు, మానవ నివాసాలు



మట్టుకు స్థిరంగా వుండి ఏడుస్తాయా అన్న వేదాంతం అక్కడి గృహ నిర్మాణంలో ధ్వనిస్తోంది. మూడు మూరల కన్నా ఎత్తులేని మట్టి గోడలపైన ఎలా వీలైతే అలా పై కప్పులు ఏర్పాటుచేసుకుని, బోర్లించిన కోళ్ళ గంపల్లాంటి ఆ యిళ్ళల్లో బ్రతుకుతున్నవాళ్ళని చూస్తుంటే, గుహల్లో నివసించిన ఆది మానవులు జ్ఞప్తికి వస్తారు. అలాంటి పరిసరాల నడుమ పిచ్చివాడు పెట్టుకున్న రత్న కిరీటంలా అందంగా, ఆనంద ప్రదంగా తల పైకెత్తి నిల్చున్న ఒక ముచ్చటైన కట్టడం ఎలా చోటుచేసుకున్నదన్న ధర్మ సందేహం ఆదృశ్యాన్ని చూపిన వాళ్ళెవరికైనా కలిగితీరుతుంది.

బాలరాజు చెప్పగా తెలిసింది. స్థల పురాణంలా ఆ యింటికీ ఓ కథ వుంది. దర్జీ వృత్తితో జీవించే బొంతల హైదర్ వలీ సాయిబు భార్యనూ, ఇద్దరు బిడ్డలనూ ఊళ్ళో దిగవిడిచి, అదృష్టం పరీక్ష చేసుకోడం కోసం ఓ గల్ఫ్ దేశానికి వెళ్ళిపోయాడు. అక్కడి పరిస్థితులతడికి కలిసొచ్చాయి. మూడు నాలుగేళ్ళలో రెండు లక్షల దాకా మిగిలించి, ఆ డబ్బును భార్య పేరిట స్వదేశీ బ్యాంకులో జమచేస్తూ వచ్చాడు. ఈ మాత్రం కూడబెట్టిన తర్వాత అతడికి భార్య రమీజాబీ పట్ల అనుమానం పుట్టుకొచ్చింది. డబ్బు డబ్బుగా వుంటే అన్యాక్రాంతమయ్యే ప్రమాదం ఎప్పుడూ వుంటుంది. రమీజాకు పుట్టింటివాళ్ళపైన మమకారాలు హెచ్చు. చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకోడమెందుకని రెండేళ్ళ క్రితం స్వదేశానికి వచ్చినప్పుడతడు మూలధనమంతా వెచ్చించి యిల్లు కట్టించి, భార్యా బిడ్డల పేరిట రాయించి నిశ్చింతగా 'కువాయిట్'కు తిరిగి వెళ్ళాడు. అలా వెళ్ళడమే వెళ్ళడం. ఆపైన జాబూ లేదు. డబ్బూ లేదు. అజా పజా గూడా తెలియరాలేదు. చిరుగుల చీరలు కట్టుకుంటూ, వట్టి పిండి సంగటితో పొట్టబోసుకుంటూ, బ్రతుకు తెరువు కోసం ప్రతి రోజూ ఏదైనా కూలి పనికి వెళ్ళవలసి వున్న రమీజాబీకి, తానీ మేడలో నివసించడంలో న్యాయం లేదనిపించింది. అందుకని ఊరి చివర ఓ చిన్న గుడిసె వేయించుకుని, భర్త తనకు నజరానాగా యిచ్చిపోయిన యింటిని అద్దెకివ్వాలన్న నిర్ణయానికి వచ్చేసింది.

రమీజాబీని ఆమె స్థాయికి తగ్గట్టుగా ఓ గుడిసెలోకి తరలించి, నన్ను ఆప్యాయంగా ఆహ్వానిస్తున్న ఆ యింటిని నేను సగర్వంగా పరిశీలించి చూసుకున్నాను. అందులో నివసించడం వల్ల బ్యాంకు మేనేజరు స్టేటస్సు నిస్సందేహంగా పెరిగి తీరుతుందనుకున్నాను. మెట్లెక్కి డాబాపైకి వెళ్ళి పిట్టగోడ కానుకున్నట్టుగా నిల్చుని పరిసరాలన్నీ పరకాయించి చూసిన తర్వాత నా అభిప్రాయం మరింతగా బలపడిపోయింది.

గుడిసెలూ పాకలూ కొట్టాలూ లాంటి యిళ్ళ మధ్య నేను నిల్చున్న మేడ చుక్కల్లో చందమామలా వుంది. పిచ్చి మొక్కల నడుమ తియ్యమామిడి చెట్టులా వుంది. గాజు పూసల మధ్య అసలైన వజ్రంలా వుంది. ఆ మేడపైన నేను నిల్చున్నానా, కొత్తగా వచ్చిన బ్యాంకు మేనేజర్ని చూడ్డం కోసమని ఆ వాడ ప్రజలందరూ యిళ్ళు వదలిపెట్టి వీథుల్లోకి వచ్చేశారు. అది ప్రాచీన కాలాల్లో రాజ దర్శనం కోసం ప్రజలు కోట మైదానంలో మూగే సన్నివేశంలా వుంది.

''ఒక మాట సార్! వీళ్ళ విషయంలో మాత్రం మీరు కొంచెం జాగ్రత్తగా వుండాలి...''

వెనుదిరిగి చూశాను. బాలరాజు నా వెనుక వైపున కొద్ది దూరంలో నిలబడి వున్నాడు.

''తాము దూరడానికి సందు లేకపోయినా మెడకొక డోలు గూడా కట్టుకోవాలన్నది వీళ్ళ తాపత్రయం. అదిగో ఆ గంగరావిచెట్టు కింద నిల్చున్నాడు చూశారా, మెడకు ఎర్ర రుమాలా చుట్టుకుని. అతడి పేరు కందుల మీర్ కాశిం. బస్‌స్టాండులో అతడిది బీడీ కొట్టు. దాన్ని బేకరీగా మార్చేయాలన్నది అతడి సంకల్పం.''

నేను ఆసక్తితో తల పంకించాను. జ్యూరి డిక్షనులోని వ్యక్తుల్ని గురించి క్షుణ్ణంగా తెలిసిపెట్టుకోవాలి మరి, అది బ్యాంకు మేనేజరు ప్రథమ కర్తవ్యం.

''జండా కొయ్య కెదురుగా వున్న యింటి అరుగుపైన కూచున్నాడే లుంగీవాలా, అతడు చుక్కలూరు ముస్తఫా. బండీ ఎద్దులున్నాయి. సరుకుల్ని సంతకు తోలుకెళ్తుంటాడు. ఈ మధ్య అతడి బుర్రలో ఒక కొత్త ప్లాను రొద బెడుతోంది. బండినీ ఎద్దుల్నీ తెగనమ్మి చాలని దానికి డబ్బు ఎగేసి ఎట్లాగైనా ఓ ఆటో రిక్షా కొనుక్కోవాలట!''

''ఊ హూ, అలాగా!''

''అంతేకాదులెండి! ఇక్కడున్న వాళ్ళంతా యిలా పెద్ద కొండలకు నిచ్చెనలేసే రకమే! తట్టలో బఠాణీలమ్ముకునే పాచ్చారు నాలుగు చక్రాల బండిపైన మిఠాయి దుకాణం పెట్టుకోవాలని వుంది. సైకిలు పైన సత్తు బోకులమ్ముకునే చిగురాకుల సత్తారుకు కూల్ డ్రింకుల షాపు పెట్టుకోవాలని వుంది. పాత ఇనప సామాన్లు సేకరించి అమ్ముకునే హమీదు టోకుగా పది సైకిళ్ళు కొని అద్దెకిచ్చుకోవాలనుకుం



టున్నాడు. ఫోటోలు తీయడంలో అంతో యింతో ప్రావీణ్యత కలిగి వున్న రజబ్ అలీ హాయిగా స్టూడియో నడుపుకోవాలని ఉబలాటపడిపోతున్నాడు. ఇళ్ళ పని మేస్త్రీ మురాద్ సాయిబు పెద్ద ఎత్తున ఇటుక రాళ్ళ ఇండస్ట్రీ మొదలెట్టాలని చూస్తున్నాడు. ఎటొచ్చీ యిలాంటి కోరికలు నెరవేర్చుకోడానికి వాళ్ళ దగ్గర లేనిదీ, అవసరమైనదీ డబ్బే. ఆ డబ్బును మనం మన బ్యాంకులో రాసులు రాసులుగా పోసుకుని వుంటామనీ, తలచుకుంటే దోసిళ్ళ నిండా ఎత్తి ఎత్తి యివ్వగలమని వాళ్ళనుకుంటారు..."

'సరేలే, విషయమేమిటో తెలిసిపోయిందిగా! మన జాగ్రత్తలో మనం వుండొచ్చు' — అని నేను చెప్పలేదు. హేలగా నవ్విన నవ్వులోనే ఆ భావాన్ని సూచించాను. ఇబ్బంది అనేది ఏ వైపు నుంచి వస్తుందో తెలిస్తే దాని బారి నుంచి తప్పించుకోడం కష్టమేమీ కాదు. అందులోనూ మనం ఎవరితోనైతే వ్యవహరించవలసి వుందో వాళ్ళ విద్యావివేకాలు మన గుప్పిట్లోకైనా చాలనివైనప్పుడు వాళ్ళతో వ్యవహరించడం చాలా సులభం. ఎందుకైనా మంచిదని కాపురం సర్దుకుంటున్న రోజుల్లోనే మా ఆవిడను ఎదురుగా కూచోబెట్టుకుని శ్రద్ధగా ఓ ప్రయివేటు క్లాసు తీసుకున్నాను— "ఈ ఇంటి నొక ఏకాంత ద్వీపంగా వుంచు. ఎవరైనా పలకరించినా చెవిలో వేసుకోకు. పనిమనిషితో సైతం ఉబుసుపోక కబుర్లకు దిగకు..."

ఏడెనిమిది నెలలు గడిచాయి. ఇదేమంత తక్కువ కాలం గాదు. అయినా నేను దర్గామిట్ట జనంతో అత్యంత ప్రతిభావంతంగానే వ్యవహరించగలిగాను. ఇంటి నుంచి వెలుపలికి బయల్దేరినప్పుడుగానీ, లేదా తిరిగి వస్తున్నప్పుడుగానీ ఎవరైనా ఎదురుపడి 'సలామండీ అయ్యగారూ!' అంటే నేను చెయ్యి మాత్రం కొంచెం పైకెత్తి, పెదవి కాస్త కదిలించి, ఎదుటి వ్యక్తి ముఖమైనా సరిగ్గా చూడకుండా తప్పుకునేవాణ్ణి. ఒక వ్యక్తి ఒకటికి పదిసార్లుగా కనబరచుకుని 'అయ్యాగారూ! నా పేరు మస్తానండీ!' అని చెప్పుకున్నా సరే, 'ఓహో, ఆ రోజొచ్చావుగా, జ్ఞాపకముంది. నీ పేరు కరీముల్లా గదూ!' అని ఎనలేని చిత్తశుద్ధితో పలకరించేవాణ్ణి. బ్యాంకు చుట్టూ తచ్చాడి తచ్చాడి వాళ్ళల్లో ఎవరైనా అప్పడగడం కోసం లోపలికొచ్చేస్తే 'అబ్బే, ఛార్జీ తీసుకుని యింకా ఒక నెల రోజులైనా కాలేదే! ఓపిక పట్టండి' అని కొంతకాలం, 'పై నుంచి ఉత్తరువులు రావాలి' అని మరికొంత కాలం, 'అప్లికేషన్లు పెట్టండి చూద్దాం' అని మళ్ళీ కొంతకాలం, 'అన్నట్టు మీకు ష్యూరిటీ యిచ్చేవాళ్ళెవరైనా వున్నారా?' అని ధర్మసందేహాన్ని ప్రకటిస్తూ కొంతకాలం — యిలా జాప్యం చేయడంలో కృతకృత్యతను సాధించాను. అయితే ఒకటి. ఎన్ని విధాలుగా నిరుత్సాహపరిచినా వాళ్ళు తమ సహనాన్ని కోల్పోవడం లేదు. నా పైన కోపతాపాలు ప్రదర్శించడమున్నూ లేదు. బ్యాంకు నుంచి లోన్లు సంపాదించడం తమ జీవితంలో ఒక భాగమైనట్టు, అందు కోసం ప్రయత్నించడం తమ ముఖ్య బాధ్యతల్లో ఒకటైనట్టు వాళ్ళు మా బ్యాంకుకు గస్తీ కాస్తూనే వున్నారు.

ఒకనాటి రాత్రివేళ నేను తినీ తీరి, నా గదిలోని వాలు కుర్చీలో పడుకుని భుక్తాయాసంతో ఆపసోపాలు పడుతుండగా, మెల్లగా ఓ కునుకు కమ్మేసింది. ఆ మగత సమయంలో అద్దంలోకి నీడ చొచ్చుకుని వచ్చినట్టుగా ఓ ఆకారం వచ్చి వచ్చి నా ఎదుట నిలబడిపోయింది. రావడం రావడంతోటే అది కయ్యానికి నన్ను కవ్విస్తూ వచ్చింది.

"అయ్యా, రాజగోపాలం! నిన్నొక మాట అడగాలని వచ్చాను. మరేం లేదు. ఈ దర్గామిట్ట జనం పైన నీకేమైనా కోపమా?"

నాకు ఒళ్ళు పొగలు బోయింది—" నాకు దర్గామిట్ట వాళ్ళ పైన కోపమా? ఎందుకని? వాళ్ళతో నా కేమిటి సంబంధం?" అంటూ వుర్రుడించాను.

"మంచి మాటే! అద్దంలో నీకు నీ ముఖమే కనిపించకపోతే ఎలాగయ్యా రాజగోపాలం! నువ్వు బ్యాంకు మేనేజరివి. వాళ్ళు బ్యాంకు నుంచి అప్పులు పొందాలని ఆశించేవాళ్ళు. వాళ్ళకు లోనివ్వడం నీ కిష్టం లేదనుకో! ఆ మాట తేల్చి చెప్పెయ్యొచ్చు గదా! నువ్వు పామునూ చావనివ్వవు, బడితనూ విరగనివ్వవు. తప్పించుకుంటావు. తప్పుకుంటావు. ముఖం తప్పిస్తావు. వాళ్ళ ప్రాణాలను ఉసూరుమనిపిస్తావు. వాళ్ళచేత మూడు చెరువుల నీళ్ళు తాగిస్తావు. ఏమిటి నీ ఉద్దేశం?"

ఈసారి నాకు ఒళ్ళు మండిపోయింది. "ఓరి బడాచోర్! నువ్వెవడివిరా ఫూల్?" — పై కప్పు ఎగిరిపోయేటట్టుగా గొంతు చించుకున్నాను.

కానీ నిజంగానే అరిచానా అని నా అనుమానం! ఆ మాత్రం అరిచివుంటే వంటింట్లో నుంచి మా ఆవిడ పరుగెత్తుకుంటూ వచ్చివుండాలి గదా! వీథుల్లో నులకమంచం వేసుకున్న సాయిబులు అయ్యగారికేమిటో మూడినట్టుందని వచ్చి దబదబా తలుపుల్ని బాది వుండాలి గదా! అలాంటిదేం లేదే! ఇంతకూ నేను మాటాడుతున్నానా? మాటాడుతున్నట్టుగా భ్రమిస్తున్నానా? చూస్తున్నానా? లేక
చూస్తున్నట్టుగా భ్రమిస్తున్నానా!

నా విచికిత్సలో నేనుండగా ఎదుటి మనిషి పగలబడి నవ్వుతున్నాడు. పొట్టచెక్కలయ్యేటట్టుగా నవ్వి నవ్వి అలిసిపోయాడు.

"ఛత్, అసందర్భంగా ఏమిటా నవ్వు?" అని చీదరించుకున్నాను.

"లేకపోతే నువ్వెవరివని నన్నడిగేవాడివేనా! ఒకప్పుడు మనం పువ్వూ తావిలా, శబ్దమూ అర్థంలా కలిసివుండేవాళ్ళమని తెలియదా? ఇటీవల కొన్నేళ్ళుగా నీకు నా పొడంటే గిట్టకపోయింది. పొమ్మని మెడబట్టి గెంటినా నేను చూరు పట్టుకుని వేలాడుతూనే వున్నాను. నా హితబోధ నీకు వెగటుగా వుంటుందని తెలుసు. అయినా నా ప్రయత్నం నేను చేయకుండా వుండను..."

ఈ పీడను వీలైనంత త్వరగా వదిలించుకోడం మంచిదనిపించింది. "ఏడ్చావులే! చెప్పదలచుకున్నదేదో చెప్పి ఏడువు" అన్నాను.

"నాయనా రాజగోపాలం! ఎవడికి వాడు ఒంటరిగా గాకుండా మనుషులందరూ కలిసి ఒక సమాజంగా జీవిస్తున్నారని నీకు తెలుసా?"

"తెలుసులే! అందుకిప్పుడేమయింది?"

"ఆ సమాజానికి శ్రేయస్సు చేకూర్చడం కోసం కొన్ని సంస్థలు ఏర్పాటయ్యాయనీ, వాటిలో 'బ్యాంకులు'న్నూ ఒకటని నీకు తెలిసేవుండాలి మరి..."

ఈ శాల్తీ నా ముంగాళ్ళ కేదో బంధం వేయబోతున్నాడని నా కర్థమైపోయింది. బదులేమీ చెప్పకుండా మూకీ భావం వహించాను.

"అర్హులైనవాళ్ళకు అప్పులివ్వడం ఆ బ్యాంకుల కున్న బాధ్యతల్లో ఒకటి. అవునా, కాదా?"

నేను తుపాకీ తూటాలా పేలిపోయాను. "అయితే అర్హులైన వాళ్ళెవరో నిర్ణయించుకునే బాధ్యత మేనేజరుదే! దారంట వెళ్ళే దానయ్యది గాదు."

"శాంతం శాంతం! మిస్టర్ రాజగోపాలం! నువ్వు కాస్త దివి నుంచి భువికి దిగి రావాలి నాయనా! బ్యాంకు సదుపాయాలు సూర్యకిరణాల్లా మారుమూల ప్రాంతాల కల్లా చొచ్చుకరావడం దేశ ప్రజల కందరికీ అందుబాటులో వుండాలనే గదా! రకరకాల కారణాల పైన భూస్వాములకూ, షావుకార్లకూ, వర్తక ప్రముఖులకూ అప్పులిస్తే సరిపోయిందా: కొంచెం సామాన్యుల వైపు గూడా చూడొద్దా? అదేమంటే ఫిక్సెడ్ డిపాజిట్లలో డబ్బు కట్టలేనివాళ్ళకు, సేవింగ్సు ఖాతా అయినా ప్రారంభించలేనివాళ్ళకు బ్యాంకు లెందుకు అప్పివ్వాలి అని నువ్వనగలవు. తమ జీవన





స్థాయిని పెంచుకోడానికే గదటయ్యా వాళ్ళు నిన్ను అప్పడగడం! నేల మన్నవాళ్ళు నేలనే వుండిపోవాలని ఏమీలేదే! పాకకు బదులు పెంకుటిల్లు వేసుకోవచ్చుగా! చిరుగులకు మాసికలు వేసుకోడానికి బదులు కొత్త బట్టలు కొనుక్కోవచ్చుగా! పలకా పుస్తకాలూ కొని పెట్టి తమ బిడ్డల్ని బడికి పంపించుకోవచ్చుగా! ఆ మాత్రం ఉపకారం చేసి పెట్టే అవకాశం నీకుండగా, నువ్వు నిర్దాక్షిణ్యంగా వాళ్ళకు మొండి చెయ్యి చూపిస్తావా? పోనీ బాబూ! పరవాలేదులే! సృష్ట్యాది నుంచీ వాళ్ళు బ్యాంకులిచ్చే అప్పులతోనే జీవిస్తున్నారా? ఎండకెండి మగ్గి మాడి, ప్రాణుల పాదాల కింద నుగ్గు నూచమైపోయిన తర్వాత గూడా పది వానచినుకులు పడ్డంతో చిగురించే గరికపోచల్లా వాళ్ళు ప్రకృతితో పోరాడుతూ, పరిస్థితులతో పోరాడుతూ ఎట్లాగో బ్రతకగలుగుతున్నారు. ఆ మాటకేంగానీ,వాళ్ళ ఆశల్ని అడియాసలు చెయ్యడం నీకు మాత్రం మంచిది కాదు.''

'ఏమండీ! ఇంకా పడుకోలేదా?' అన్న మా ఆవిడ పిలుపుతో నాకు స్పృహ వచ్చింది. కళ్ళు తెరిచాను. ఇందాకా నాలాంటి వ్యక్తితోనే నాకు జరిగిన సంవాదం మాటేమిటి? అది కల అయినా అయివుండాలి, లేదా నా ఊహ అయినా కావాలి. ఏమైనా వాళ్ళ ఆశల్ని అడియాసలు చేయడం నీకు మంచిది గాదు?''అన్న అతడి మాట రోజుకు పదిసార్లైనా నా చెవుల్లో ప్రతిధ్వనిస్తూ వచ్చింది. అయితే అనతికాలంలో అది పాటింపుకు రావచ్చునని మాత్రం నేననుకోలేదు.

అనంతరాజుపేటను ఒరుసుకున్నట్టుగా 'ముచికుంద' అన్న ఏరు ప్రవహిస్తుంది. దానిపైన ఓ ప్రాజెక్టు కట్టాలని సంకల్పించి నీటి ముంపుకు గురయ్యే పొలాలకు నష్టపరిహారంగా ప్రభుత్వం రైతులకు దాదాపు పది లక్షల దాకా చెల్లించాలని నిర్ణయించింది. ఆ చెల్లింపులు స్థానిక జాతీయ బ్యాంకు ద్వారా జరిగేటట్టు ధ్రువీకరించి ఆ మేరకు మాకూ రైతులకు గూడా ఉత్తరువులు పంపించింది. ఈ ఉత్తరువులు ఆధారంగా వుంచుకుని అడ్వాన్సు కింద పాతిక వంతు డబ్బయినా యివ్వవలసిందని రైతులు నా పీకల మీద కూర్చున్నారు. ఆ మాత్రం పెద్ద మనసుంచినట్టయితే నష్టపరిహారంగా ముట్టే డబ్బంతా మా బ్యాంకులోనే యఫ్.డి. కింద జమచేయగలమని వాగ్దానం చేశారు. ఎట్లాగూ ప్రభుత్వ నిర్ణయం జరిగిపోయింది గనుక ఆ మాత్రం రిస్కు తీసుకోవడం వల్ల కొంపేమీ మునిగిపోదని అనుభవజ్ఞులు కొందరు ఉచిత సలహా పారేశారు. తప్పో, ఒప్పో ఆ పని కాస్తా జరిగిపోయాక రాష్ట్రంలో జనరల్ ఎలక్షన్లొచ్చిపడ్డాయి. పులి మీద పుట్రగా ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీ గెలిచి, అధికారంలోకి వచ్చింది. గద్దెనెక్కిన కొత్త ప్రభుత్వం ముచికుంద ప్రాజెక్టు స్కీమును మూలన పడేసింది. అయిదారు నెలలు గడిచినా అతీగతీ లేదు. రైతులు అడ్వాన్సుగా తీసుకున్న డబ్బును అప్పటికప్పుడే చెల్లించే పరిస్థితిలో లేరు. గాఢ నిద్రలో వుండి ఆవురావురుమన్న ఆకలితో తటాలున లేచి కూచున్న రాక్షసుడిలా మా బ్యాంకు యాజమాన్యం తన దీర్ఘ హస్తాలను నా వైపు సాచసాగింది. వాళ్ళ తాఖీదులకు సంజాయిషీ యిచ్చుకోలేక నా తల దిమ్మదిరిగింది. ఏం జరుగుతుందో తోచక మనసంతా వికలమైపోయిన స్థితిలో ఓ రోజు పోస్టులో అందిన సస్పెన్షన్ ఉత్తరువుతో బాటు, బస్సులో కొత్త మేనేజరు గూడా వచ్చి దిగేశాడు.

అధికారం, హోదా, దర్పం మొదలైనవన్నీ ఒక్క క్షణంలో వుండి, మరు క్షణంలో లేకపోతే ఆ రెండు క్షణాలకు గల అంతరాన్ని మాటలతో వెల్లడించడం సులభసాధ్యంగాదు. ఆ రోజు ఛార్జీ అప్పగించడంలో గూడా నేను మరబొమ్మలా మాత్రమే వ్యవహరించాను. ఇంటి నుంచి కారియర్ వచ్చింది. కానీ మధ్యాన్నం అన్నం తిన్న జ్ఞాపకమే లేదు. నెత్తురు చుక్కలేని ముఖాన్ని నలుగురూ ఎక్కడ చూసిపోతారోనని బాగా చీకటి పడిన తర్వాత దొంగలా యిల్లు చేరుకున్నాను. నాకు నేనై విధించుకున్న గృహ నిర్బంధ శిక్ష అప్పటి నుంచి ప్రారంభమైపోయింది. మరునాటి నుంచీ ప్రొద్దు పొడిచింది గానీ, ప్రుంకిందిగానీ నేను చూడలేదు. మెలకువా నిద్రా గూడా ఒక్కలాగే తోచాయి. నా పాలిటికి కాలం ఘనీభవించి పోయింది.


కొంత కాలం గడచిన తర్వాత ఆక్విటన్స్ ఫారమ్ చేతబట్టుకుని అటెండరు యింటికి వచ్చాడు. 'సంతకం పెట్టించుక రమ్మన్నారు సార్!' అంటూ డబ్బు చేతికిచ్చాడు. ఎంచి చూసుకున్నాను. రూపాయలు అయిదు వందల ఇరవై ఆరు మాత్రం వున్నాయి. సస్పెన్షనులో వున్న బ్యాంకు ఉద్యోగి సగం జీతానికి అర్హుడని నాకు తెలుసు. అటెండరు వైపు ప్రశ్నార్థకంగా చూశాను. 'కటింగ్స్ అన్నీ పోనూ మిగిలిందింతేనట సార్!' అన్నాడు. నా కర్థమైంది. సగం జీతంలోనే మినహాయింపులు గూడా చేసేసుకున్నారంటే మళ్ళీ నా ఉద్యోగం నాకు దక్కడం సందేహాస్పదంగా భావిస్తున్నారన్న మాట! సస్పెన్షన్ గోరుచుట్టుపైన కొత్త మేనేజరు హృదయ రాహిత్యం రోకటి పోటులా తగిలింది.

నా జీవితంలో ఎక్కువ భాగం ఒక చీకటి గదికే పరిమితమైపోయిన ఆ రోజుల్లో నా ప్రతిబింబంలాంటి పూర్వ పరిచిత వ్యక్తి మళ్ళీ ఒకసారి నాతో బేటీ అయిపోయాడు. భయంకరమైన ఏకాంతాన్ని భగ్నం చేస్తూ మళ్ళీ అతడు నీడలాగే వచ్చి నా ఎదుట నిలబడి ''వెరీ సారీ మిస్టర్ రాజగోపాలం! స్వతహాగా నేను నిష్ఠురవాదినే! ఎప్పుడు చెప్పాల్సిన సత్యాన్ని అప్పుడు చెప్పెయ్యడం నా వాడుక - పోనీ, బలహీనత!'' అన్నాడు.

''పరవాలేదు చెప్పు'' అన్నాను. అప్పుడు నేవతణ్ణి ఎదిరించడానికి గానీ, తృణీకరించడానికి గానీ, మెడబట్టి గెంటడానికి గానీ వీల్లేని అశక్తుణ్ణిగా వున్నాను.

''చిక్కులనేవి ఎవరికైనా వస్తాయి. నీ ఉద్యోగ జీవితంలో నీకూ ఒక చిక్కు వచ్చింది. ఉద్యోగం వుంటుందా, వూడుతుందా అన్న బెంగ నిన్ను పట్టి పీడిస్తోంది. చిక్కి సగమైపోయావు. గదిలో కూచుని ఎడతెగని ఆలోచనలతో సతమతమైపోతున్నావు. అయితే నాకో సందేహం. నాయనా రాజగోపాలం, ఈ పరిస్థితిలోనైనా నువ్వెప్పుడైనా నీ చుట్టూ వున్న వాళ్ళని గురించి ఆలోచించావా? దర్గా మిట్టలో వంద కుటుంబాలైనా వున్నాయి. అయిదారు వందల మంది జనం వున్నారు. వాళ్ళల్లో కుటుంబ పోషణ కోసం పాటుబడేవారు రెండు వందలకు తక్కువుండరు. వాళ్ళు నీలా చదువుకోలేదు. జానాబెత్తెడు గుడిసెలు తప్పితే ఆస్తిపాస్తుల్లేవు. బ్రతుకు వెళ్ళదీయడానికున్నదల్లా ఒకటే సాధనం — కాయకష్టం. వాళ్ళు చింతచెట్లెక్కి కాయలు రాలుస్తారు. పండుకొడతారు. చింత పండు తీసుకెళ్ళి దూర ప్రాంతాల్లో అమ్ముకొస్తారు. పూత బట్టినప్పుడు మామిడి చెట్లకు మందు కొడతారు. కాయలు దించుతారు. బుట్టలు కుడతారు. లారీలకు భర్తీ చేస్తారు. వేరుశనగ పంట ఒబ్బిడి చేస్తారు. కూరగాయలు, సత్తుగిన్నెలు, పళ్ళు, లుంగీలు యిలా దేనికి గిరాకీ వుంటే దాన్ని తీసుకెళ్ళి పల్లెల్లో అమ్ముకుంటారు. ఇటుక రాళ్ళు మోస్తారు. మోల్డింగు పనులకు వెళ్తారు. గోడలకు వెల్ల వేస్తారు. టీ కొట్లు పెట్టుకుంటారు. వీటిలో ఒక పని గౌరవప్రదమైందని గానీ, యింకొకటి హీనమైందని గానీ అనుకోరు. స్టీలు తట్టల్లో పాలకోవా బిళ్ళలమ్ముకున్నంత






ధీమాగానే తట్టతో ఎండు చేపల్ని గూడా అమ్ముకుంటారు. వాళ్ళకు లేనిదల్లా రోజు లెట్లా గడుస్తాయన్న బ్రతుకు భయం. వాళ్ళకున్నదల్లా ఎట్లాగైనా బ్రతకగలమన్న ఆత్మబలం. మరైతే మన సంగతేమిటి? వ్యక్తిత్వం నుంచీ ఉద్యోగం మైనస్ చేసేస్తే నువు పూచిక పుల్లపాటి చేయవు. నీకున్నదల్లా బ్రతుకు భయం. లేనిదల్లా ఆత్మబలం. ఇప్పుడు చెప్పు రాజగోపాలం! ఎవరు గొప్ప? సమాజానికి పునాదుల్లాంటి కష్ట జీవులా? అవకాశాలూ అదృష్టాలూ కలిసొస్తే నాలుగక్షరాలు నేర్చుకుని ఆఫీసులో ఎల్రక్టిక్ పంకాల క్రింద కూర్చుని అయిదు నిమిషాల కొకసారి కాలర్ సవరించుకునే తెల్లఛొక్కాల వాళ్ళా?"

ప్రసంగం ముగిసిన తర్వాత కళ్ళు తెరిచేసరికి గదిలో నేనొక్కణ్ణే మాత్రమే వున్నాను. అతడెలా వచ్చాడో అలాగే మాయమైపోయాడు.

రెండు రోజులు గడిచాయి. సాయం కాలపు నమాజు కోసం మసీదు నుంచి పిలుపు వినిపించి పది నిమిషాలై వుంటుంది. మా ఆవిడ గది గుమ్మంలోకి వచ్చి గుండెలు తరుమనే కబురు ఒకటి నివేదించింది.

"ఏమండీ! ఇంటి బాడుగకేమో రమీజాబీ వచ్చింది."

"పెట్టెలో చూడు. మన సంగతి దేవుడు పెట్టినట్టవుతుంది. నాలుగు వందలుంటే ఇచ్చెయ్..."

మరికొంతసేపటికి హాల్లో నుంచి నాకు రమీజాబీ మాటలే వినిపించాయి.

"అదేం మాటమ్మా! మీ కష్టాల్లో మీరుంటే నేను బాడిగ అడిగేదానికొస్తానా? అప్పటికి నేనేమన్నా రాయినా, రప్పనా తల్లీ! ఉంటాది. ఏడికి పోతాది? అంతా ఒకసారి కలిపి యియ్యరా? ఆ మాట చెప్పిపోదామని వొస్తి. నా చేతుల కష్టం నాకుందిలే. నేనూ, నా బిడ్డలు కలో అంబలో తాగలేమా? సచ్చిపోతామా? ఏ జల్మలో చేసుకున్న పాపమో, మా యింట్లో మారాజు పోయిన దోవ తెలియక పోయె! రెండేండ్లయింది. లచ్చనంగా తిరిగొస్తే పకీర్లకు వస్త్ర దానం యిస్తానని నాగూరు బాబాకు మొక్కుకుంటి. రెండు పిడికిల్లు నిండా ఎండి కాసులు ఉండీలో ఏస్తానని ఏడుకొండల సామికి మొక్కుకుంటి. ఏదేముడైనా దయదలస్తాడో లేదో..."

రమీజాబీ కంఠం గద్గదికమైపోయింది. నా చెంపలకు చల్లగా ఏదో సోకి నట్టుంటే తడివి చూసుకున్నాను. కన్నీరు చారికలు కడుతోంది. ఎదుటి మనిషిని అనుమానించడానికే అలవాటు పడినవాణ్ణి. మానవత్వం పట్ల పెద్దగా నిగా లేని వాణ్ణి. మనుషుల్లో యింత మంచితనం వుంటుందని తెలిసిరావడం సరికొత్త అనుభవం.

మళ్ళీ కొద్ది రోజులకు, బహుశా ఒకనాటి ఉదయం పది గంటలప్పుడను కుంటాను, వడవలో నుంచి మా ఆవిడ పిలుపు వినిపించింది. "ఏమండీ, ఒకసారి యిలా వస్తారా! ఈయనెవరో ఓ మూట యెత్తించుకొచ్చి యింట్లో వేయిం చాడు..."

వెళ్ళి చూశాను. మూతులు కుట్టేసిన నిండు బియ్యపు బస్తా గోడకానించబడి వుంది. భుజాలపైన మోసుకొచ్చిన మనిషి అప్పుడే వీథిలోకి వెళ్ళిపోయాడు. ముతవలీ (కులపెద్ద) మొహిద్దీను సాయిబు గుమ్మంలో నిలబడి వున్నాడు.

"సలామండీ అయ్యగారూ! మావాల్లందరితోనూ సెప్పి వాల్ల మాట మీదనే ఈ పని చేస్తిని. ఇదేం ఒకరి దుడ్డు గాదు. మాజమాతా (సంఘం) డబ్బుతో కొనుక్కొచ్చింది. 'మీరు మాకు సహాయం చేసేటంతటోల్లా' అనుకోవద్దు. ఏ గడ్డన పుట్టినోల్లో యిక్కడికొచ్చి మాలో వొకరుగా చేరితిరి. మీకొక బాధొస్తే మా కొచ్చినట్టు కాదా? మనుషులని నాక కష్టాల్లో ఆదుకోవాల. సంతోసాలు పంచు కోవాల. ఏం తొందర్లేదు. మళ్ళీ మీ కాలం మీకు కలిసొచ్చినప్పుడే యివ్వొచ్చు. కష్టాలెల్లకాలమూ వుంటాయా? మంచుకరిగినట్టుగా కరిగిపోవా?..."

నా ఉద్యోగానికి గ్రహణం పట్టనైనా పట్టిందిగానీ, అప్పటి నుంచి నేను, మా ఆవిడ, మా పిల్లలిద్దరు — వెరశీ మేము నలుగురమూ ఒక పెద్ద సమిష్టి కుటుంబంలో సభ్యులమైపోయినట్టయింది. అనుదిన వినియోగానికి అవసరమైన వస్తువులెలాగో — కొన్ని సందర్భాల్లో నాకు, మరికొన్ని సందర్భాల్లో మా ఆవిడకు గూడా తెలియకుండా యిల్లు చేరుకునేవి. ఎవరో కుర్రాడు కూరగాయలు తెచ్చేవాడు. ఎవరు పంపించారు రా అబ్బీ అంటే బదులుండేది గాదు. అట్లాగే బజార్లో మూటలు మేసే ఓ మూగబ్బాయి కిరాణా సామాన్లు ఒక గోతంలో కట్టి తీసుకొచ్చి యింట్లో పడేసేవాడు. ఎవరు పంపించారని అతడి నడిగి లాభ మేముంది? ఏ ప్రశ్నకైనా 'ఇహిహీ' అన్నదే సమాధానం. వంట కట్టెల సంగతి మరీ విచిత్రం. అవి ప్రహరీ గోడపై నుంచీ మెల్లగా పెరట్లోకి జారిపోతుండేవి. అయితే తీవ్ర రుగ్మతతో తీసుకుంటున్న రోగికి మధురాహారాలు వెగటైనట్టుగా, మనుషుల సౌజన్యాన్ని హరాయించుకోడం నా పాలిటికి దుర్భరమైపోతూ వచ్చింది. 'ఓరి భగవంతుడా! ఈ ధర్మసంకటానికొక ముగింపు లేదా?' అని మథన పడిపోసాగాను. ఇందులో గూడా దైవం దైవంలా గాకుండా మనుషుల రూపంలోనే తోడ్పడ్డాడు.

కొడిగట్టిన దీపానికి మళ్ళీ నూనెపోసి వత్తి ఎగదోసినవాడు గూడా మొహిద్దీను సాయిబే! ఒకనాటి ఉదయం, వీధి మెట్లపైకి వచ్చి, వినయంగా పిలిచి వర్తమానం తెలియజేశాడు — "అయ్యగారూ! విన్న రాత్రి ఊరంతా పంచాయితీ జేరితి మండీ! రెండో మాట లేకుండా అందురుమూ ఒక బరిలో కొస్తిమి. సుట్టుపక్కల పది గ్రామాల రైతుల్ని గూడా కలుపుకొని యెమ్మెల్యే దగ్గిరికెల్లేదని తీర్మానించు కుంటిమి. 'ఏటిపైన ప్రాజెక్టు కడితిరో మంచిదే! కట్టకపోతిరో యిగ మీదట ఈ పాయకట్టులో మీకు వోటు బోణీ రాదని తెగేసి చెప్పేయాలనుకుంటిమి..."

సంచలనానికది ప్రారంభం. ప్రజలు కదిలారు, ప్రజా ప్రతినిధి కదిలాడు, ప్రభుత్వ యంత్రాంగం కదిలింది. ముచికుంద ప్రాజెక్టు కాగితాలు కదిలాయి. ఈలోగా అడ్వాన్సు పేరుతో అప్పు తీసుకున్న రైతులు గూడా వడ్డీతో సహా ఆ డబ్బు చెల్లించేశారు. నీటి ముంపుకు ప్రభుత్వ పరిహారం గూడా కొద్ది రోజుల్లోనే అందవచ్చునన్న వార్త గాలిలో కలిసివచ్చేసింది.

ఇంత జరిగాక నా సస్పెన్షను గూడా రద్దయింది. కొత్త మేనేజరును వేరొక చోటికి ట్రాన్స్‌ఫరు చేస్తూ నన్ను యథాస్థానానికే పోస్టు చేశారు.

అయితే ఈ కథకు సంబంధించినంతవరకూ నా ఉద్యోగం నాకు దక్కడమే గొప్ప విషయం గాదు. ఇంతకంటే ముఖ్యమైన విషయం మరొకటుంది. అది మాత్రం చెప్పి ఈ కథ ముగిస్తాను.

డ్యూటీలో చేరవలసిన నాటి ఉదయం తొమ్మిది గంటలకు నేను డైనింగు టేబిలు దగ్గర కూర్చుని ఉపాహారం తీసుకుంటున్నాను. వీధిలో నుంచి మంగళ వాద్యాలు వినిపించాయి. ముస్లిముల పెళ్ళి ఊరేగింపు ఆ వేళప్పుడు బయల్దేరడం మామూలే! బహుశా అదే అయివుంటుందని, నా పాటుకు నేను నింపాదిగా బయల్దేరి బయటికి వచ్చాను. భజంత్రీలు యింటి ముందరే నిలబడి వాద్యాలు మ్రోగిస్తున్నారు. ఊరంతా కట్టగట్టుకొచ్చినట్టు యింటి ముంగల నిలబడి పోయింది. ఎవరో ఓ పూలదండ తెచ్చి నా మెడలో వేశారు. ఊరేగింపు కదిలింది. ఇతరుల దృష్టిలో ఆ ఊరేగింపు కంతా నేనే ప్రధాన వ్యక్తిగా కనిపించానేమో! నా దృక్పథంలో మట్టుకు నా చుట్టూ వున్నవాళ్ళు త్రివిక్రముల్లా ఆకాశానికెదిగి పోయారు. నేను మరుగుజ్జులా వాళ్ళ వెంట నడుస్తున్నాను. ●